




ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం

# టీ-మీడియా

సామాజికం.. ప్రజల పక్షం...

సంపుటి : 9
సంచిక : 211
పేజీలు : 3

గురువారం 26.02.2026

GSTIN:36FDKPS1308P1ZX | Digital, tmedia.net.in

ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ


### ఇంటర్ మొదటి రోజు

## పరీక్ష ప్రశాంతం..

- 17 వేల 667 మంది హాజరు
- కేంద్రాన్ని తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

**టీ మీడియా,ఫిబ్రవరి25, ఖమ్మం:**జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్ష మొదటి రోజు ప్రశాంతంగా జరిగినట్లు జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు.జిల్లా కలెక్టర్, గాంధీచౌక్ లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేసి, పరీక్ష జరుగుతున్న తీరు, పరీక్షా కేంద్రం నిర్వహణ విధానం, ప్రశ్నపత్రాల భద్రత, హాల్ టికెట్ల పరిశీలన ప్రక్రియలను ప్రత్యేకంగా పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ మాట్లాడుతూలి జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రశాంతంగా నిర్వహిస్తూ, విద్యార్థు లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశామని అన్నారు. ఎండ తీవ్రత దృష్ట్యా విద్యార్థులకు చల్లని త్రాగునీరు సరఫరా చేయాలని, పరీక్ష కేంద్రానికి వచ్చే ప్రతి విద్యార్థిని క్షుణ్ణంగా తనిఖీ చేసి లోపలికి అనుమతించాలని తెలిపారు. పరీక్షా గదుల్లో వెలుతురు, తాగునీరు, టాయిలెట్ నిర్వహణ సక్రమంగా ఉండే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. మొబైల్ ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు కేంద్రంలోకి అనుమతించరాదని స్పష్టం చేశారు. సీసీ కెమెరాల పర్యవేక్షణ సక్రమంగా కొనసాగాలని సూచించారు. ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు నిరంతరం తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని జిల్లా కలెక్టర్ దైర్యం చెప్పారు. పరీక్ష సిబ్బంది తమ విధులను నిబద్ధతతో, భాద్యతగా నిర్వహించాలని, ఎలాంటి ఫిర్యాదులు వచ్చినా వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు.మొదటి రోజు ఇంటర్ మొదటి సంవత్సరం ద్వితీయ భాష పేపర్-1 పరీక్షకు జనరల్, ఒకేషనల్ కలిపి 18 వేల 258 మంది హాజరు కావాల్సి ఉండగా,





పరీక్షకు 17 వేల 667 మంది హాజరు కాగా, 591 మంది విద్యార్థులు గైర్హాజరు అయ్యారని, ఎక్కడా మాల్ ప్రాక్టీస్ నమోదు కాలేదని, మొదటి రోజు పరీక్ష ప్రశాంతంగా జరిగిందని కలెక్టర్ వెల్లడించారు.జిల్లా కలెక్టర్ పరీక్షా కేంద్రం తనిఖీ సమయంలో జిల్లా ఇంటర్మీడియట్ అధికారి రవిబాబు, సంబంధిత అధికారులు, తదితరులు ఉన్నారు.



### భద్రాద్రి రామాలయంలో

## ఇంటి దొంగలు

- స్వామి వారికి సమర్పించిన పట్టు వస్త్రాలు మాయం

**టీ మీడియా, ఫిబ్రవరి 25,భద్రాచలం:**ఇంటి దొంగలను ఈశ్వరుడైన పట్టలేడు అన్నట్లు భద్రాచలం రామాలయంలో సిసి కెమెరాలకు చిక్కకుండా విలువైన పట్టుచీరలను మాయం చేస్తున్నారు దేవస్థానం సిబ్బంది. సీతారామలక్ష్మణులకు అలంకరణ నిమిత్తం హైదరాబాదుకు చెందిన జ్యోతి అనే భక్తురాలు పట్టు పంచలతో పాటు విలువైన పట్టు చీరను సమర్పించారు. దివ్య మూర్తులకు అలంకరణ అనంతరం అంతరాలయంలో రామాలయం ఊయలలో ఉన్న పట్టుచీర ..కొద్ది సేపటి తర్వాత మాయమైంది..అంత చాక చాక్యంగా ఎవరు మాయం చేశారు..దేవస్థానంలో భాద్యత మరచిన ఉద్యోగులతో పాటు, విధుల పట్ల సిబ్బంది నిర్లక్ష్యంపై ఈవో దామోదర్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. భక్తుల మనోభావాలు దెబ్బతీసే పట్టు చీర మాయమైన ఘటనపై విచారణ జరిపి బాద్యులపై చర్యలు తీసుకుంటామని ఈవో తెలిపారు..ఎంతో సుదూర ప్రాంతాలు నుంచి భక్తితో స్వామివారిని దర్శించుకొని..వస్త్రాలు సమర్పిస్తే..ఇలా మాయం కావడం పట్ల భక్తులు ఆవేదన చెందుతున్నారు..ఇలాంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

## ఓర్మెన్‌పై దుర్భాషలాడిన కేఓసీ పీఓ

- పీఓ కార్యాలయం వద్ద కార్మికుల నిరసన



**టీ మీడియా,ఫిబ్రవరి25,టేకులపల్లి** గత కొన్ని రోజులుగా కోయగూడెం ఓసీ ప్రాజెక్ట్ ఆఫీసర్‌పై విమర్శలు వస్తున్నాయి. మూడు రోజుల క్రితం విధుల్లో ఉన్న ఓ ఓర్మెన్ పట్ల కోయగూడెం ఓసి ప్రాజెక్టు ఆఫీసర్ అసభ్యకరంగా దూషించడంతో బుధవారం కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం కేఓసీ ప్రాజెక్టు కార్యాలయం ఎదుట కార్మికులు సుమారు గంటకు పైగా ఆందోళన నిర్వహించి ప్రాజెక్టు అధికారి క్షమాపణ చెప్పాలంటూ ఆందోళనకు దిగారు. మంగళవారం ప్రాజెక్ట్ అధికారి లేకపోవడంతో తిరిగి బుధవారం కార్మిక సంఘాల నాయకులు ఓర్మెన్ దూషించిన విషయమై చర్చలు జరిపారు.బొగ్గు ఉత్పత్తి, రవాణాలో విఫలం కావడంతో పాటుగా వే బ్రిడ్జిలు తలెత్తిన సాంకేతిక తప్పిదాన్ని సకాలంలో గుర్తించడంలో నిర్లక్ష్యం వహించడంతో పాటుగా విధుల్లో ఉన్న కార్మికుల పట్ల , నిర్వాసిత ఆదివాసీల పట్ల కేఓసి పిఓ అనుసరిస్తున్న వైఖరిపై సర్వాత్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. టార్పాలిన్ కార్మికులపై దుర్భాషలాడినందుకు ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య వద్దకు విషయాన్ని తీసుకెళ్లి కేఓసి పీఓ మాట్లాడారు. సింగరేణి సిఎండి కోయగూడెం ప్రాజెక్టు అధికారిపై చర్యలు తీసుకోవాలని కార్మికులు, కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు. దీనిపై కేఓసీ పీఓ వివరణ కోసం ఫోన్ చేయగా స్పందించలేదు.

## ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యత...

### జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



**టీ మీడియా,ఫిబ్రవరి25,ఖమ్మం:** ప్రజా భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ, నగరంలో ఆధునిక మౌళిక వసతులతో పాటు ప్రజలకు నడకలో సౌకర్యం, భద్రత కల్పించే విధంగా ఫుట్ పాత్ ల నిర్మాణం చేపట్టాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. నగరంలో చేపడుతున్న అభివృద్ధి పనుల పురోగతిని బుధవారం మున్సిపల్ కార్పొరేషన్ కమీషనర్ అభిషేక్ అగస్త్య తో కలిసి జిల్లా కలెక్టర్ తనిఖీలు చేశారు. నగరంలోని 2వ డివిజన్ బల్లేపల్లి పరిసర ప్రాంతంలో నిర్మిస్తున్న ఫుట్ పాత్ పనులను, టైల్స్ డిజైన్ అకృతులను కలెక్టర్ పరిశీలించారు. ఫుట్‌పాత్ నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఫుట్‌పాత్‌లు ప్రజలకు సౌకర్యవంతంగా, భద్రతతో ఉండేలా నిర్మించాలని, చిన్న పిల్లలు, వికలాంగులు, వృద్ధులు సైతం ఎలాంటి ఇబ్బంది లేకుండా నడిచే విధంగా పనులు చేపట్టాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూలి నగరంలో ముఖ్యమైన ప్రాంతాలలో ఫుట్‌పాత్‌ల నిర్మాణానికి చర్యలు చేపట్టామని తెలిపారు. ఫుట్‌పాత్‌ల నడక ద్వారా ప్రజల రోడ్డు భద్రతకు, ఆరోగ్యానికి అత్యంత కీలకమని అన్నారు.విద్యార్థులు, ప్రజలు నడుచుకుంటూ వెళ్లే పరిస్థితులు, పిల్లలు, వృద్ధులు, వికలాంగులు ఎదుర్కొనే ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఫుట్‌పాత్‌లు అత్యంత నాణ్యతతో, సౌకర్యవంతంగా నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు. ఎక్కడా

మిగతా 3లో...

# పోచవరంన్ని ముంపు పరిధిలో చేర్చాలి

- **ఐటీడీఏ వద్ద గ్రామస్తుల ధర్నా**



**టీ.మీడియా,ఫిబ్రవరి25,చింతూరు:**కూనవరం మండలం పోచవరం గ్రామాన్ని పోలవరం ప్రాజెక్ట్ ముంపు పరిధిలో చేర్చి ఆర్ ఉ ఆర్ ప్యాకేజీ మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ పోచవరం గ్రామస్తులు చింతూరు ఐటీడీఏ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు.గ్రామస్తులు మాట్లాడుతూ---ప్రతి సంవత్సరం వరదల సమయంలో తమ గ్రామం చుట్టూ నీరు ముట్టడి చేసి, బయటకు వెళ్లేందుకు కనీస రోడ్డు సౌకర్యం కూడా లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. అత్యవసర వైద్య పరిస్థితుల్లో కూడా సేవలు అందక గతంలో ఒక వ్యక్తి ప్రాణాలు కోల్పోయిన ఘటన జరిగిందని చెప్పారు. వరదల సమయంలో తినడానికి సరిపడా ఆహారం లేక ఉపవాసం ఉండాల్సిన పరిస్థితులు ఎన్నోసార్లు ఎదురయ్యాయని, చిన్నపిల్లలు మరియు వృద్ధులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. పశువులను కాపాడుకోవడంలో కూడా తీవ్ర కష్టాలు ఎదురవుతున్నాయని తెలిపారు.ధర్నా సందర్భంగా ఐటీడీఏ పి.ఓ. స్వయంగా సంఘటనా స్థలానికి చేరుకుని గ్రామస్తుల సమస్యలను విన్నారు. రాబోయే వరదల సమయంలో పోచవరం కాలనీపై ప్రత్యేక దృష్టి పెట్టి ముందస్తుగా నిత్యావసర సరుకులు, వైద్య పరికరాలు, నాటు పడవలు, విద్యుత్ లేకపోయినా ఇబ్బంది లేకుండా అవసరమైన సౌకర్యాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. అదేవిధంగా గ్రామానికి రోడ్డు మార్గం ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఆర్ ఉ ఆర్ 41.14 లెవెల్‌లో 30 గ్రామాల ప్యాకేజీ పూర్తయిన వెంటనే పోచవరం కాలనీ పేరును ప్రాధాన్యంగా ప్యాకేజీ శాంక్షన్ జాబితాలో చేర్చేలా తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం గ్రామస్తులు తమ ధర్నాను విరమించారు.
ఈ కార్యక్రమంలో సామాజిక కార్యకర్త కొక్కెరపాటి రవీంద్ర తో పాటు పోచవరం గ్రామస్తులు సూదిపాక శ్రీనివాస్ రావు, సూదిపాక వెంకటమ్మ, కొయ్యల బుబమ్మ, చంద్రుగొండ వరలక్ష్మి, పిడియాల జయ, దాది పద్మ, జమీలి బాలరాజు, బూరుగు సుశీల, చంద్రుగొండ కుమారి, కొయ్యల వరలక్ష్మి, ఎస్.కె. మునీరా, కొయ్యల రమణ, వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.

# సమస్యలపై సింగరేణి జీఎం సానుకూల స్పందన



**టీ మీడియా,ఫిబ్రవరి25, రుద్రంపూర్**: కొత్తగూడెం ఏరియా పరిధిలోని 5-ఇంక్లైన్, మాయాబజార్ గ్రామస్తులు, ధన్బాద్ గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ రాందాస్ నాయక్ కలిసి సింగరేణి కొత్తగూడెం ఏరియా జీఎం శాలెం రాజును బుధవారం కలిశారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ రాందాస్ నాయక్, గ్రామస్తులు తమ ప్రాంతానికి సంబంధించిన పలు సమస్యలను జీఎం దృష్టికి తీసుకువెళ్లారు. సీఎస్ఆర్ నిధులను తక్షణమే విడుదల చేయాలని, స్థానికులకు డీఎల్ఆర్ ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, 5-ఇంక్లైన్, మాయాబజార్ గ్రామస్తులకు కేటాయించిన ఇంటి స్థలాలు (సర్వే నెం. 143, గంగా హుస్సేన్ బస్తీ, కొత్తగూడెం పరిధి)లో రోడ్లు, డ్రైనేజీలు, త్రాగునీరు, స్ట్రీట్ లైట్లు వంటి మౌలిక వసతులు వెంటనే కల్పించాలని విజ్ఞప్తి చేశారు. గ్రామస్తుల అభ్యర్థనలపై జీఎం సానుకూలంగా స్పందిస్తూ సంబంధిత అధికారులతో చర్చించి తక్షణ చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో పలువురు గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

# 'ఆ లారీలతో తమకు తీవ్ర అన్యాయం'

- **రెండోరోజు కొనసాగిన టిప్పర్ల ఓనర్ల నిరసన**



**టీ మీడియా,ఫిబ్రవరి25, టేకులపల్లి :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండలంలోని కోయగూడెం ఉపరితల గని నుండి నవభరత్, బీపీఎల్ కు బొగ్గు రవాణా చేస్తున్న 12, 14 టైర్ల లారీ ఓనర్లు 16 టైర్ల లారీల వల్ల తమకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. టేకులపల్లి మండలంలోని చుక్కలబోడు సమీపంలో లారీ ఓనర్స్ అసోసియేషన్ కార్యాలయం వద్ద 12, 14 టైర్ల లారీల ఓనర్లు లారీలను నిలిపి బుధవారం రెండో రోజు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా లారీ ఓనర్లు, డ్రైవర్లు మాట్లాడుతూ... గతంలో మాదిరిగానే 12, 14 టైర్ల లారీలను మాత్రమే నవభరత్, బీపీఎల్ కు వెళ్లే విధంగా చూడాలన్నారు. 16 టైర్ల బండ్లు వస్తే ఎక్కువ టన్నుల బొగ్గు వారికి లోడ్ అవుతుందని, తద్వారా తమకు తీవ్ర అన్యాయం జరుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. 16 టైర్ల లారీల ద్వారా సవభరత్, బిపిఎల్ కు బొగ్గు లోడ్ ఇస్తే తమకు తీవ్ర అన్యాయం జరుగుతుందని, లారీలకు ఈఎంఐ కట్టే పరిస్థితి కూడా ఉండదని ఆవేదన వ్యక్తం చేశారు. 16 టైర్ల బండ్లను ఇల్లెందుకు చెందిన ఓ కాంట్రాక్టర్ తీసుకురావడంతో తమకు అన్యాయం జరుతుందని, ప్రజా ప్రతినిధుల సహకారం తనకే ఉందని అంటున్నడని వారు ఆరోపించారు. దీంతో లారీల ఓనర్లకు ఉరితాడు అవుతుందని, కుటుంబాలు ఇబ్బందుల పాలవుతామన్నారు. గతంలో లానే లారీలను నడిపి తమకు ఇల్లెందు ఎమ్మెల్యే న్యాయం చేయాలని కోరారు.

## భూదాన్ భూములపై

# చర్యలు చట్టబద్ధం..

- **జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**




**టీ మీడియా,ఫిబ్రవరి25,ఖమ్మం:**వెలుగుమట్ల గ్రామ సర్వే నం. 147, 148, 149 లోని భూదాన్ భూములపై జిల్లా యంత్రాంగం చేపట్టిన కూల్చివేతలు, స్వాధీనం చర్యలు పూర్తిగా చట్టబద్ధమైన వని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.31 ఎకరాల 7 గుంటల భూదాన్ భూమి ఆక్రమణలో ఉండగా, సంబంధిత భూమి మొత్తం విలువ సుమారు 250 కోట్లకు పైగా ఉంటుందని, భూదాన్ బోర్డు భూమిని సిసిఎల్ఏ, హై కోర్ట్ ఆదేశాల మేరకు ప్రభుత్వం స్వాధీనంలోకి తీసుకోవడం ద్వారా భారీ స్థాయిలో ఆస్తిని రక్షించగలిగామని కలెక్టర్ తెలిపారు.ఫిబ్రవరి 24 నాడు నిర్వహించిన కూల్చివేతలపై తెలంగాణ హైకోర్టులో లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేయగా, కోర్టు దానిని తిరస్కరించినట్లు కలెక్టర్ తెలిపారు. భూదాన్ యజ్ఞ బోర్డు, రెవెన్యూ శాఖ సమగ్ర విచారణలో నకిలీ పత్రాలు, అక్రమ కేటాయింపులు వెలుగు చూశాయని, ఇప్పటికే పలువురిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. హైకోర్టు స్టే ఉన్న నిర్మాణాలను మినహాయించి మిగిలిన భూమిని ప్రభుత్వం స్వాధీనం లోకి తీసుకున్నట్లు తెలిపారు. స్వాధీనం చేసుకున్న భూమిని భవిష్యత్ ప్రజా అవసరాలకు ఉపయోగిస్తామని, ఇండ్లు కోల్పోయిన వారిలో అర్హులైన స్థానిక పేదలకు ప్రభుత్వం తగు విధంగా న్యాయం చేయడానికి చర్యలు తీసుకుంటుందని తెలిపారు.

# సర్పంచ్ ఎన్నికల్లో హామీ..

- **పెళ్లి కూతురు కుటుంబానికి బీరువా**



**టీ మీడియా,ఫిబ్రవరి25,టేకులపల్లి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండలంలోని చుక్కలబోడు గ్రామపంచాయతీ సర్పంచ్ భానోత్ రామా నాయక్ తన గ్రామ ఓటర్లకు ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు. ఆదర్శంగా నిలిచారు. తాను గెలిస్తే ప్రతి ఇంటిలో ఆడపడుచుల పెళ్లి సందర్భంగా బీరువా అందజేస్తానని స్థానిక పంచాయతీ ఎన్నికల్లో హామీ ఇచ్చారు. మేరకు బుధవారం చుక్కల బోడు గ్రామపంచాయతీలో మాలోత్ కిషన్, జ్యోతి కుమార్తె వివాహం సందర్భంగా సర్పంచ్ బానోత్ రామా నాయక్ ఆ కుటుంబానికి బీరువా అందజేశారు. దీంతో బీరువా అందుకున్న కుటుంబం హర్షం వ్యక్తం చేసింది. తమకు బహుమతి అందించిన సర్పంచ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామపంచాయతీ ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం బీరువా అందజేశారని పంచాయతీ ప్రజలు చర్చించుకుంటున్నారు.

# ఆ గ్రామం స్వచ్ఛభారత్ కి వ్యతిరేకం





**టి మీడియా, ఫిబ్రవరి 25,ఖమ్మం రూరల్:** స్వచ్ఛభారత్ స్వచ్ఛవికాస్ అనేది 2 అక్టోబర్, 2014న భారత ప్రభుత్వం ప్రారంభించిన ఒక జన ఉద్యమం , ఇది బహిరంగ మలవిసర్జనను నిర్మూలించడం , పరిశుద్యని మెరుగుపర్చటం వ్యర్థాల నిర్వహణ , ప్రజల్లో పరిశుభ్రత పట్ల బాధ్యతని పెంపొందించటం ద్వారా దేశ ప్రగతికి ఆరోగ్యకరమైన జీవనం అందించటానికి స్వచభారత్ స్వచ్ఛ వికాస్ ను ప్రారంభించడం జరిగింది, కానీ ఆ గ్రామం లో డ్రైనేజీ కాలువలు , బహిరంగ ప్రదేశాలు మురుగు నీటి సరఫరా చూస్తే స్వచ్ఛభారత్ స్వచ వికాస్ కి పూర్తి వ్యతిరేక అనిపిస్తుంది ఈ సమస్య గత నాలుగు సంవత్సరాలుగా ఆ గ్రామం నీ పీడిస్తున్న మురుగు నీటి వాసన తో ప్రజలు ఇబ్బందులు పడుతున్న, విపరీతమైన దోమలు చుట్టు పక్కల ఇంట్లో కి వస్తున్న ఆ గ్రామ ప్రజలు పలుమార్లు ప్రభుత్వం అధికారుల దృష్టికి తీసుకపోయిన పట్టించుకున్న నాధుడే లేడని ఆ గ్రామ ప్రజలు తెలిజేస్తున్నారు.

# ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు ప్రారంభం

**పరీక్షలకు 7 గురు గైర్హాజరు**



**టీ మీడియా,ఫిబ్రవరి25, సింగరేణి (కారేపల్లి):** కారేపల్లి మండలం ఇంటర్మీడియట్ పరీక్షలు బుధవారం ప్రశాంతంగా ప్రారంభమైనాయి. ఇంటర్ ప్రధమ సంవత్సర పరీక్షలకు 516 మంది హాజరు కావల్సి ఉండగా 7గురు విద్యార్థులు గైర్హాజరు కావటంతో 509 మంది హాజరైనారు. మోడల్‌స్కూల్ సెంటర్‌లో ముగ్గురు, ప్రభుత్వ జూనియర్ కళాశాల కేంద్రంలో నల్గురు విద్యార్థులు గైర్హాజరు అయినట్లు అధికారులు తెలిపారు.విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు ఉదయం 9 గంటల లోపే హాజరయ్యారు వారిని తనిఖీచేసిన అనంతరం పరీక్షా కేంద్రంలోకి అనుమతించారు. పరీక్ష కేంద్ర సమీపంలోని షాపులను మూసివేశారు.

# కోట్ల రూపాయల అక్రమ వ్యవహారం...

- **అధికారుల మౌనం ఎందుకు?**
- **ఇన్ని రోజులు అక్రమాలు జరుగుతుంటే...**

**అధికారులు ఏమి చూస్తున్నారు?**




**టీ మీడియా,ఫిబ్రవరి25, సింగరేణి (కారేపల్లి):**కారేపల్లి మండలంలోని ఐకేపీ కేంద్రంలో రూ.3 కోట్లకుపైగా నిధులు మళ్లించబడిన ఘటన వెలుగులోకి రావడం సంచలనంగా మారింది. మహిళా సంఘాల పేర్లపై రుణాలు మంజూరు చేసి, సభ్యులకు సమాచారం లేకుండానే డబ్బులు బదిలీ అయినట్లు బయటపడుతున్న ఆరోపణలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. అయితే ప్రశ్న ఒక్కటే ఇన్ని రోజులు ఇలా జరుగుతుంటే సంబంధిత అధికారులు ఏమి చేస్తున్నారు? మండలంలో దాదాపు 60 మహిళా సంఘాలు ఉన్నాయని, వాటిలో పలుచోట్ల సీసీ, బ్యాంకు లింకేజ్ రుణాల పేరుతో కోట్ల రూపాయలు మంజూరైనట్లు సమాచారం. సభ్యులకు పూర్తి వివరాలు ఇవ్వకపోవడం, పాస్‌బుక్ నమోదు లేకపోవడం, బ్యాంకు ఖాతాల లావాదేవీల్లో పారదర్శకత లేకపోవడం,ఇవి అధికారుల పర్యవేక్షణ లోపాన్ని స్పష్టంగా చూపుతున్నాయి. సంఘాలపై నమ్మకంతో స్వయం సహాయక సంఘ మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయటానికి వడ్డీ లేని రుణాలు సైతం ఇస్తుంది. ఇప్పటికే పావల వడ్డీకి ప్రభుత్వం నిధులు కేటాయిస్తుంటే, వాటి వినియోగంపై క్రమం తప్పకుండా ఆడిట్ చేయాల్సిన బాధ్యత అధికారులదే. నెలనెలా సమీక్షలు, ఖాతాల తనిఖీలు, ఫీల్డ్ విజిట్లు ఉంటే ఈ స్థాయిలో అక్రమాలు ఎలా జరుగుతాయి? అన్న ప్రశ్నలకు ఇప్పటివరకు స్పష్టమైన సమాధానం లేదు. స్థానికంగా పలువురు సభ్యులు ఫిర్యాదులు చేసినప్పటికీ స్పందన లేకపోవడం మరింత అనుమానాలకు తావిస్తోంది. అధికారుల నిర్లక్ష్యం, పర్యవేక్షణ లోపం, అంతర్గత వ్యవస్థల బలహీనత ఇవి కలిసే ఈ పరిస్థితి తీసుకొచ్చాయా? అనే చర్చ జోరుగా సాగుతోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు సమగ్ర దర్యాప్తు చేపట్టి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. లేకపోతే మహిళా సంఘాలపై ప్రజల లో నమ్మకం దెబ్బతినే ప్రమాదం ఉందని స్థానికులు హెచ్చరిస్తున్నారు. అక్రమాలు బయటపడిన తర్వాత స్పందించడం కాదు, ముందుగానే అడ్డుకోవడమే అధికారుల అసలు బాధ్యత. ఆ బాధ్యతను ఇంకా ఎంతకాలం విస్మరిస్తారో చూడాలి అని మండల ప్రజలు అధికారుల పనితీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నారు.



## పెసర పంటలను పరిశీలించిన శాస్త్రవేత్తలు

**టీ మీడియా,ఫిబ్రవరి25, కూసుమంచి:** కూసుమంచి మండలంలోని కిష్టాపురం గ్రామంలో జాతీయ ఆహార భద్రత పథకం క్రింద సాగుచేసిన పెసర పంటపై క్షేత్ర ప్రదర్శన నిర్వహించారు. కూసుమంచి ఏడీఏ సతీష్ మాట్లాడుతూ పప్పు దినుసుల ప్రాముఖ్యతను రైతులకు వివరించారు. కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ చైతన్య రైతులనుద్దేశించి మాట్లాడుతూ... పెసర పంటకు సంబంధించిన చీడపీడలపై అవగాహన కల్పించారు. అనంతరం పెసర పంటను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారిణి శ్రీమతి రామడుగు వాణి వ్యవసాయ విస్తరణ అధికారులు జానీ బాబా, వంశీకృష్ణ రైతులు పాల్గొన్నారు.



## బొమ్మ కళాశాలలో
# విద్యారులు కాంపస్ ఎంపికలు

- **ప్లేస్మెంట్ పొందిన 16. ముంది విధ్యార్థులు**

**టీ మీడియా,ఫిబ్రవరి25, ఖమ్మం:**ఎంపిక కావడం 'గర్వ కారణం ఇటితల కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన ప్లెసమంట్ అనేక మంది విద్యారణలు పాల్గొన్నారు. ఎంపిక ప్రక్రియలో బాగంగా వ్రాత పరీక్ష, సాంకేతిక ఇంటర్వ్యు మరియు హెచ్. ఆర్. ఇంటర్వ్యులు నిర్వహించగా అందుల 16 మంది విద్యార్థులు విజయవంతంగా ఎంపికవవారు. ఈసందర్భాంగా కళాశాల చైర్మన్ శ్రీ బోమ్మ రాజేశ్వరరావు మాట్లాడుతూ. విధ్యార్థుల కృషి పట్టుదల, మరియు ఆద్యాపకుల మార్గదర్శకత్వం వల్ల ఈ విజయాన్ని సాహించగలిగామని తెలిపారు.వైస్. బేరన్ బొమ్మ సతుఢ్రనాద్ గారు మాట్లాడుతూ పొలిధ్యార్థులకు ఇలాంటి మాక్ ఇంటరో శిక్షణాలు మాఅధ్యాపకులచే నిర్వహించటం వలనే ఈ రాజు ఇంతమంది విద్యారులు ఎంపికవ్వడం జంగింది. ఈ సందర్భాంగా కళాశాల ప్రిన్సపల్ ఎంపికై విద్యార్థ్యాలను మరియు ట్రైనింగ్ అండ్ ప్లేస్మంట్ ఆఫీసరను. భినందించారు. భవిష్వత్తులో కూడా మరిన్ని ప్రముఖ సంస్థలతో ఫ్లెన్మెంట్ అవకాశాలను కల్పించేందుకు కళాశాల యాజమాన్యం. కట్టుబడి ఉందని పెర్కొన్నారు.

## తొలి రోజు ఇంటర్ పరీక్షలు ప్రశాంతం

- **అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్.**

**టీ మీడియా,ఫిబ్రవరి25, భద్రాద్రి కొత్తగూడెం:**జిల్లాలో ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల తొలి రోజు ప్రశాంత వాతావరణంలో సజావుగా నిర్వహించబడినట్లు అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీ డి. వేణుగోపాల్ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా పరీక్షలు ఎటువంటి




అంతరాయం లేకుండా క్రమబద్ధంగా నిర్వహించబడినట్లు తెలిపారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 37 పరీక్షా కేంద్రాలలో పరీక్షలు నిర్వహించబడినట్లు తెలిపారు. జనరల్, వొకేషనల్ విభాగాలు కలిపి మొత్తం 9,685 విద్యార్థులు ఉండగా , అందులో 9,210 మంది పరీక్షలకు హాజరయ్యారని వెల్లడించారు. జనరల్ విభాగంలో 7,973 మందికి విద్యార్థులు ఉండగా , 7,683 మంది హాజరయ్యారు. వొకేషనల్ విభాగంలో 1,712 మంది ఉండగా, 1,527 మంది హాజరయ్యారు. మొత్తం 475 మంది అభ్యర్థులు గైర్హాజరైనట్లు తెలిపారు.పరీక్షల సందర్భంగా ఎలాంటి మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని, పరీక్షా కేంద్రాలలో తాగునీరు, విద్యుత్, వైద్య సదుపాయాలు, భద్రతా చర్యలు తదితర అన్ని మౌలిక వసతులు సమృద్ధిగా కల్పించినట్లు అదనపు కలెక్టర్ తెలిపారు .తదుపరి రోజుల్లో నిర్వహించనున్న పరీక్షలు కూడా ఇదే విధంగా పకడ్బందీగా నిర్వహించాలని సంబంధిత అధికారులను అదనపు కలెక్టర్ ఆదేశించారు. విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో పరీక్షలకు హాజరై ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు.ఈ పరిశీలనలో సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఫ్యాక్టరీలో జోరుగా గంజాయి అమ్మకాలు

- **కూలీలు, ఉద్యోగులే టార్గెట్.**

**వికారాబాద్ ,ఫిబ్రవరి 25 (నలుదిక్కులు):** :జిల్లా పరిగి మండలంలో పెద్ద మొత్తంలో గంజాయిని ప ట్టు బ డి ం ది. మండలంలోని సుగుణ స్టీల్ ఫ్యాక్టరీ సమీపంలో ఎక్సైజ్ పోలీసులు 1 కేజీ 50 గ్రాముల గంజాయి సీజ్ చేశారు. బీహార్, ఒడిస్సా నుంచి వచ్చిన నితీష్



రఘ్రూక్, సూరజ్ కుమార్‌లను అరెస్టు చేశారు. పరిగి మండలం సుగుణ స్టీల్ ఫ్యాక్టరీలో పనిచేసే లేబర్లకు గంజాయి విక్రయిస్తున్నారనే పక్కా సమాచారంతో ఎక్సైజ్ సీఐ నీరజాదేవి బృందం దాడి చేసింది. బీహార్ నుంచి గంజాయి తీసుకువచ్చిన ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. విచారణలో వారు ఒడిస్సా ప్రాంతం నుంచి తీసుకువచ్చి తోటి లేబర్లకు అమ్ముతున్నట్లు ఒప్పుకున్నారు.ఈ మేరకు ఇద్దరిపై చట్టం కింద కేసు నమోదు చేసినట్లు సీఐ నీరజాదేవి తెలిపారు. ఫ్యాక్టరీలో పనిచేసే లేబర్ల మధ్య గంజాయి వ్యాపారం విస్తరిస్తోందని వివరించారు. ఇలాంటి అక్రమాలను అరికట్టేందుకు తనిఖీలు పెంచామని చెప్పారు. 6 నెలల్లో తెలంగాణ వ్యాప్తంగా ఎక్సైజ్ శాఖ భారీగా గంజాయి సీజ్ చేసింది. ఖమ్మం, హైదరాబాద్ వంటి ప్రాంతాల్లో 100 కేజీలకు పైగా గంజాయి, హాషీష్ ఆయిల్ పట్టుకున్నారు. 2024లో ఎక్సైజ్ నేరాలు పెరిగి, గంజాయి విక్రయాలు జోరుగా సాగాయి. తెలంగాణకు ఎక్కువగా గంజాయి ఒడిస్సా, ఆంధ్ర ఉత్తరాంధ్ర అటవీ ప్రాంతాల నుంచి వస్తోంది. ఒడిస్సా సరిహద్దు గ్రామాల్లో పండించిన గంజాయిని బీహార్, ఇతర రాష్ట్రాల ద్వారా తెలంగాణలోకి తీసుకువస్తున్నారు.

# నేరస్తులకు శిక్ష పడే విధంగా కృషి చేయాలి

- **జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపిఎస్**

**టీ మీడియా,ఫిబ్రవరి25, భద్రాద్రి కొత్తగూడెం:**జిల్లా ఎస్పీ రోహిత్ రాజు పోలీస్ హెడ్ క్వార్టర్స్ నందు బుధవారం జిల్లా పోలీస్ అధికారులతో నెలవారీ నేర సమీక్షా సమావేశాన్ని ఏర్పాటు చేయడం జరిగింది.ఈ సమావేశంలో పాల్గొన్న పోలీస్ అధికారులతో ఎస్పీ మాట్లాడుతూ ప్రతీ కేసులో 'క్వాలిటీ ఆఫ్ ఇన్వెస్టిగేషన్' ద్వారా నేరస్తులకు శిక్షపడే




విధంగా చేసి బాధితులకు న్యాయం చేకూర్చాలని సూచించారు.కేసుల విచారణలో జాప్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు.పోలీస్ అధికారులంతా బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు.నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై క్రమశిక్షణా చర్యలు తప్పవని అన్నారు.పెట్రోలింగ్,బ్లూ కోల్ట్స్ వాహనాలతో అధికారులు,సిబ్బంది ఎల్లప్పుడూ రోడ్లపై తిరుగుతూ ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు.గంజాయి వంటి మత్తు పదార్ధాలు,మట్కా,జూదం లాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు.జిల్లా వ్యాప్తంగా హాట్ స్పాట్స్ ను గుర్తించి గంజాయిని రవాణా చేసే వ్యక్తులతో పాటు గంజాయిని సేవించే వారిపై కూడా కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు.జిల్లాలోని ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలోని అన్ని ప్రదేశాలలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకునే విధంగా చర్యలు చేపట్టాలని తెలిపారు.సీసీ కెమెరాల ప్రాముఖ్యత గురించి ప్రజలలో అవగాహన కల్పించి తమ తమ నివాస ప్రాంతాల్లో మరియు వ్యాపార సముదాయాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా చేయాలని తెలిపారు.ప్రాపర్టీ కేసుల్లో ప్రస్తుతం పోలీసు శాఖ వినియోగిస్తున్న సాంకేతికతను ఉపయోగించి నేరస్తులను పట్టుకుని సొత్తును రికవరీ చేసి భాదితులకు త్వరతగతిన అందేలా చూడాలని తెలిపారు.సైబర్ నేరాల బారిన పడకుండా ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ అవగాహనా కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని కోరారు.

జిల్లా వ్యాప్తంగా సైబర్ నేరాల్లో నగదును కోల్పోయి,భాధితులు వెంటనే స్పందించి ఫిర్యాదు చేసినప్పుడు తక్షణమే స్పందించి వారికి అండగా ఉండాలని సూచించారు.తెలంగాణ ప్రభుత్వం రోడ్డు ప్రమాదాలను తగ్గించడానికి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ాతీతీఅజవ-ాశ్రీఅజవ-2026 రెండో విడతలో భాగంగా ప్రజలకు రోడ్డు భద్రతా నియమాల పట్ల అవగాహన కల్పించాలని సూచించారు.ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రదేశాలను గుర్తించి(బ్లాక్ స్పాట్స్) వాటి నివారణకై సంబంధిత అధికారులతో సమన్వయం పాటిస్తూ ప్రమాద నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు.పెండింగ్లో ఉన్న కేసుల సత్వర పరిష్కారానికి న్యాయాధికారులతో సమన్వయం పాటిస్తూ బాధితులకు న్యాయం చేకూరేలా పనిచేయాలని తెలిపారు.మద్యం సేవించి వాహనాలను నడుపుతూ,ర్యాష్ డ్రైవింగ్ చేస్తూ రోడ్డు ప్రమాదాలకు కారణమయ్యే వారి గురించి నిరంతరం వాహన తనిఖీలు చేపట్టి పట్టుబడిన వారిపై చట్టపరంగా కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ సమావేశంలో భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ ఐపిఎస్,కొత్తగూడెం డిఎస్పీ ఆదినారాయణ,పాల్వంచ డిఎస్పీ సతీష్ కుమార్,మణుగూరు డిఎస్పీ రవీందర్ రెడ్డి,ఇల్లందు డిఎస్పీ వెంకన్న బాబు,డీసిఆర్బీ డిఎస్పీ మల్లయ్య స్వామి మరియు జిల్లాలోని సిఐలు,ఎస్సైలు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# భూదాన్ బాధితులకు కేటీఆర్ అండ

**కేటీఆర్ పర్యటనను విజయవంతం చేయండి**

**టీ మీడియా,ఫిబ్రవరి25, సింగరేణి (కారేపల్లి) :**



ఖమ్మం వెలుగుమట్ల భూదాన్ భూములలో నివాసం ఉంటున్న బాధితులకు అండగా బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు(కేటీఆర్) అండగా నిలుస్తున్నారని మాజీ దిశ కమిటీ సభ్యులు బీఆర్ఎస్ నాయకులు లాకావత్ లక్ష్మన్ అన్నారు. బుధవారం కారేపల్లిలో విలేకరులతో మాట్లాడుతూ నిలువ నీడలేని పేదలు ప్రభుత్వ భూములలో ఇండ్లు కట్టుకోని నివసిస్తుంటే వారి ఆశలను చిదిమివేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ఇండ్లను నిర్ధక్షణంగా కూల్చివేసిందని విమర్శించారు. బాధితులను కలిసి వారికి అండగా నిలవటానికి కేటీఆర్ గురువారం ఖమ్మం రానున్నారని లక్ష్మన్ తెలిపారు. సింగరేణి మండల బీఆర్ఎస్ నాయకులు హాజరుకావాలని కోరారు.

## ప్రజల భద్రతకు
# అత్యంత ప్రాధాన్యత...

పనులు జరగాలని అధికారులను ఆదేశించారు.నగరంలో తొలిసారిగా వినూత్నంగా టైల్స్ తో ఫుట్‌పాత్‌లు నిర్మిస్తున్నట్లు తెలిపారు. మంచి అకృతితో ఉపయోగించడం వలన ఆకర్షణీయంగా ఉండటమే కాకుండా వర్షం, ఎండ వంటి వాతావరణ పరిస్థితులకు అనుకూలంగా, దీర్ఘకాలికంగా నిలిచి ఉండేవిధంగా ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.దివ్యాంగులు, వృద్ధులు సులభంగా నడిచేలా స్లోప్‌లు, ఎడ్జ్‌లు సరిగ్గా రూపకల్పన చేయాలని, ప్రజలకు వెలుతురు వలన ఏలాంటి ఇబ్బందులు కలగకుండా, రాత్రి వేళ అసౌకర్యం లేకుండా లైటింగ్ పోల్స్ ఏర్పాటు చేయాలన్నారు. నగరం అంతా ఒకే విధమైన డిజైన్‌తో గ్రానైట్ ఫుట్‌పాత్‌లు ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు కలెక్టర్ సూచించారు.నగరంలో ఫుట్‌పాత్‌ల అభివృద్ధి వల్ల ప్రజలు నడక వైపు మొగ్గు చూపుతారని, దీని ద్వారా శారీరక ఆరోగ్యం మెరుగుపడుతుందని కలెక్టర్ తెలిపారు. జరుగుతున్న నిర్మాణ అభివృద్ధి పనుల అమలులో ఎక్కడా నిర్లక్ష్యం చోటు చేసుకోకుండా పూర్తి బాధ్యతతో పర్యవేక్షణ చేస్తూ పనులు పూర్తిచేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ మల్లీదు వెంకటేశ్వర్లు, పబ్లిక్ హెల్త్ ఎస్ఇ రంజిత్, మునిసిపల్ ఇఇ కృష్ణలాల్, మునిసిపల్ కార్పొరేషన్ సహాయ కమీషనర్ అనిల్ కుమార్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

